ప్రజాశక్తి
గురువారం 23 మే 2024
5
శ్రీ సత్యసాయి

పట్టణంలో అడ్మిషన్‌ల కోసం ప్రచారం చేస్తున్న ఓ కళాశాలకు చెందిన అధ్యాపకులు



సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి పది రోజులు కావస్తోంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్ధేశంతో టిడిపి, వైసిపి అభ్యర్థులు అన్ని అస్త్రాలను ప్రయోగించారు. పోలింగ్ ముగిసిన అనంతరం గెలుపుపై ఈ రెండు పార్టీల నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై బయటకు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం భయం వెంటాడుతోంది. ముఖ్యంగా పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా ఉంటుందన్న దానిపైనే ఎక్కువ ఆందోళన అభ్యర్థుల్లో కన్పిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే అభ్యర్థులు వారి పరిధిలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో నమోదైన పోలింగ్ వివరాలను తీసుకుని ఎవరికి అనుకూలంగా ఓట్లు పడి ఉంటాయన్న దానిపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. ఈ సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా చూసుకున్నప్పుడు తమకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ అభ్యర్థులు, ముఖ్య నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొద్ది పాటి మెజార్టీతో అయినా తాము బయట పడుతామనే ఆశాభావంలో ఉన్నారు. ఇదే సమయంలో సర్వే ఏజెన్సీలతో పాటు నిఘా వర్గాల నివేదిక ఆధారంగా గెలుపుపై అంచనాకు వస్తున్నారు.

పైకి గాంభీర్యం..లోపల భయం..!

- ఎన్నికల్లో గెలుపుపై అభ్యర్థుల్లో టెన్షన్
- పెరిగిన ఓటింగ్ శాతంపై లోలోన గుబులు
- పోలింగ్ సరళిపై సొంత సర్వేల ద్వారా ఆరా
- టిడిపి, వైసిపి నాయకుల ఎవరి ధీమా వారిదే...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోలింగ్ ముగిసి దాదాపు పది రోజులు కావస్తున్నా పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు మాత్రం ఆగడం లేదు. మిగితా ఎన్నికల కంటే ఈ సారి ఓటర్లు భిన్నంగా ఓటు వేసి ఉంటారనే అంచనాలో అభ్యర్థులు ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. మహిళలు, యువత, వృద్ధులు ఇలా అందరూ కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార పార్టీపై వ్యతిరేకతతోనే ప్రజలు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారంటూ టిడిపి నేతలు చెబుతున్నారు. ఇదే సమయంలో ఐదేళ్ల పాలనలో తాము చేసిన సంక్షేమం, ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారంతా మరోసారి గెలిపించాలన్న ఉద్ధేశంతో ఓటింగ్ పాల్గొన్నారంటూ వైసిపి నాయకులు ధీమా ఉన్నారు.

సర్వేల ద్వారానూ వివరాల సేకరణ

పోలింగ్ అనంతరం అభ్యర్థులు, నాయకులు సర్వేల ద్వారా గెలుపుపై అంచనాలను తీసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే సర్వే సంస్థలకు నియోజకవర్గంలో గెలుపోటములపై అంచనా వేసే బాధ్యతలను అప్పగించారు. 2019 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను పోలింగ్ బూత్‌ల వారీగా అంచనా కడుతున్నారు. సర్వే సంస్థలకు బాధ్యతలు అప్పగించి నియోజకవర్గంలో ఎక్కువగా శ్యాంపుళ్లను సేకరించి ఓటింగ్ సరళిపై ఒక అంచనాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లకు ఫోను ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోంది. తాము ఏపార్టీకి చెందిన వారం కాదని, కేవలం ఓటరు నాడిని తెలుసుకోవడానికి ఫోన్ చేస్తున్నాం అంటూ ఓటురు ఎవరికి ఓటు వేశారనే విషయం తెలుసుకునే ప్రయత్నం జరుగుతోంది. సామాజిక తరగతుల వారీగా కూడా అభిప్రాయ సేకరణ జరుగుతోంది. తద్వారా గెలుపోటములు నిర్ధేశించుకునే పనిలో అభ్యర్థులు పడ్డారు.

విహారయాత్రలో ఉన్నా... ఓటింగ్‌పైనే చర్చ..!

ఎన్నికల్లో గెలుపుకోసం దాదాపు మూడు నెలల పాటు అభ్యర్థులు ప్రచారాల్లో నిమగ్నం అయ్యారు. క్షణం తీరిక లేకుండా గడిపారు. పోలింగ్ ముగియగానే చాలా మంది అభ్యర్థులు కాస్త సేదదీరేందుకు విహార యాత్రలకు వెళ్లారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అభ్యర్థులు విహార యాత్రల్లో ఉన్నాగానీ గెలుపుపై ఎప్పటికప్పుడు నియోజకవర్గ, గ్రామ స్థాయి నాయకులతో మాట్లాడుతున్నారు. పోలింగ్ జరిగిన రెండు రోజుల తర్వాత పరిస్థితి ఎలా ఉంది..? వారం రోజుల తర్వాత ఎలా ఉంది.? ఇప్పుడెలా ఉంది..?! అంటూ ఆరా తీస్తున్నారు. ప్రజల నాడిని ఎప్పటికప్పుడు అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి రోజూ వారున్న ప్రాంతం నుంచే పోలింగ్ సరళిపై చర్చలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మహిళల పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువ పెరగడం ఎవరికి లాభం అన్న దానిపేనే లెక్కలు వేస్తున్నారు. ఎన్ని లెక్కలు వేసుకున్నా చివరకు మాత్రం మనమే గెలవబోతున్నాం అంటూ ద్వితీయ శ్రేణి నాయకుల వద్ద అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల్లో కూడా ఉత్కంఠ

పోలింగ్ ముగిసిన అనంతరం ప్రజల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నారన్న దానిపై ఉత్కంఠ పెరిగింది. ఎవరు గెలుస్తారన్న దానిపై ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తునే రచ్చకట్ట చర్చలు జరుగుతున్నాయి. టిడిపి నాయకులు కలిసిన చోట వారి పార్టీ గెలుస్తుందని, వైసిపి నాయకులు కలిసిన చోట తాము గెలవబోతున్నాం అంటూ నాయకులు ధీమాగా ఉండడంపై ప్రజల్లోనూ ఉత్కంఠను రేపుతోంది. రెండు పార్టీల నేతలు ఎవరూ తగ్గడకుండా నమ్మకంగా ఉన్న నేపథ్యంలో ఫలితాలపై ఓటర్లు కూడా అత్యంత ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు..!

- కార్పొరేట్ విద్యాసంస్థల ముందస్తు ప్రచారాలు
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా శాఖ నిబంధనలకు నీళ్ల వదలాయి. ర్యాంకుల సునామీ, అత్యుత్తమ ఫలితాల్లో మాదే అగ్రగామి, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు మా విద్యార్థులకే సొంతం అంటూ అందమైన ప్రకటనలతో విద్యార్థులకు గాలం వేస్తున్నాయి. పలు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్‌ల కోసం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడే సీట్ బుక్ చేసుకుంటే ఫీజులో రాయితీ అంటు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో నడుపుతున్న కొన్ని ఇంటర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం శోచనీయం. ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టని ఆయా కళాశాలలు అడ్డగోలుగా అడ్మిషన్లను దండుతున్నాయి. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సుమారు 160 వరకు ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ దాదాపు 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసౌకర్యాల నడుమ పలు ప్రయివేటు కళాశాలల్లో ఇరుకు గదులుల్లోనే నిర్వహిస్తున్నారు. ఫ్యాన్లు, మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత మరి తీవ్రతరంగా ఉంది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలు సిబ్బందికి వేతనాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుండడంతో తక్కువ మందిని నియమిస్తున్నారు. ఇలా పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక అనేక మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి కొన్ని కళాశాలల్లో కనిపిస్తుంది. ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న నీటిపైనే ఆధారపడాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సెక్షన్‌కు 80 మంది విద్యార్థులు, కోటా ప్రకారం సీట్ల కేటాయింపు బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యతమైన బోధనను అందించే అధ్యాపకులు లేని కళాశాలలు జిల్లాలో అనేకం ఉన్నాయి. వీటిపై పరిశీలన జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ కళాశాలలు బ్రాంచీల పేరుతో ఒకటి రెండు కళాశాలలకు అనుమతులు తీసుకుని, 4, 5 కళాశాలల ద్వారా అడ్మిషన్లు చేసి తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటువంటి కళాశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కళాశాలలకు గుర్తింపు లేకపోతే విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుంది. గుర్తింపు లేని కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రాక, సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యలో చేరేందుకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇలా అనేక సమస్యలు వస్తాయి. కళాశాలకు అనుబంధంగా వసతి గృహాలను నడిపాలంటే తప్పని సరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు అనుమతులు లేకుండానే వసతి గృహాలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా జిల్లాలో ఉన్న పలు ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వ్యాపారమే పరమావధిగా ఇంటర్ బోర్డు నిబంధనలకు నీళ్లొదిలేలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మాయ ప్రకటనలతో మభ్యపెట్టే యత్నం పలు కళాశాలలు ఆకర్షణీయమైన ప్రకటనలను అదర గొడుతున్నాయి. అత్యధిక మార్కులు తమ సొంతం అంటూ ఊదర గొడుతున్నాయి. ఈ మాయలో పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి లక్షలు దండుకుంటున్నాయి. కార్పొరేట్ సంస్థల్లో కాబోయే ఇంజినీర్లు, డాక్టర్లుగా తల్లిదండ్రులు ఊహించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలకు అనుమతులున్నాయో లేవో చూసుకోవడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అనుమతులున్న కార్పొరేట్ల మాయ మాటలు సైతం నమ్మి మోసపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలే ఉత్తమం అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రశాంతమైన తరగతి గదులు, సైన్స్ విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్ సదుపాయాలతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలను అందించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలే ఉత్తమమైనవని ప్రభుత్వ అధికారులు, అధ్యాపకులు తెలుపుతున్నారు. పైసా ఫీజు చెల్లించనవసరం లేకుండా చదువుల్లో కొనసాగవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికతో కషి చేస్తున్నారు.

తాడిపత్రిలో కొనసాగుతున్న
సిట్ దర్యాప్తు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రిలో పోలింగ్ రోజు, ఆ తర్వాత హింసతో చెలరేగిన అల్లర్లపై సిట్ బందాల దర్యాప్తు కొనసాగుతోంది. తాడిపత్రికి సిట్ బందం మరోసారి వచ్చింది. సిట్ బందం తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడులకు సంబంధించిన వీడియోలు, రికార్డులను పరిశీలించారు. అల్లర్లకు ప్రధాన కారణంగా గుర్తించిన రాళ్లదాడిని ఎందుకు నియంత్రించలేకపోయారని స్థానిక పోలీసులను సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బి అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా? లేదా? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే జిల్లా ఎస్పీతో పాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని మరికొందరు పోలీసులు ఆందోళన చెందుతున్నారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకూ సిట్ బందం తాడిపత్రిలోనే ఉండి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సిట్ దర్యాప్తుతో ఇప్పటివరకు 728 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. సిట్ ఇప్పటివరకు చేసిన దర్యాప్తును బహిర్గతం చేయాలని తాడిపత్రి ప్రజలు కోరుకుంటున్నారు.

తాడిపత్రిలో పోలీసుల మాక్ డ్రిల్

మరో ఘర్షణను తలపించేలా పోలీసుల తాడిపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మండల పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి ఆధ్వర్యంలో పోలీసులు మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. ఘర్షణను తలపించేలా పోలీసులు సన్నివేశాన్ని సృష్టించారు. ఘర్షణలు నిజంగా జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అల్లరి మూకలను ఎలా చదరగొట్టాలి అనే విషయాన్ని వివరించేలా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కోసం 5 కి.మీ. వెళ్లాల్సిందే..!

రొద్దం : మండలంలోని చిన్నగువ్వలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో గ్రామస్తులు రొద్దం, ఆర్.మరవపల్లి తదితర గ్రామాలకు ద్విచక్ర వాహనాల్లో సుమారు 5 కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనంపై నీటిని తెచ్చుకుంటున్న చిన్నగువ్వలపల్లి గ్రామస్తులు

వైవిధ్యభరితం..పర్యావరణహితం..!

- ఉద్యానవపంటలతో కర్బన ఉద్గారాలు తగ్గింపు
- సాగుచేసే రైతుకు ప్రోత్సాహకాలు
- ఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో అమలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పర్యావరణ కాలుష్యంతో భూతాపం పెరిగిపోతోంది. ఈ విపత్తును తగ్గించేందుకు పర్యావరణ సమతుల్యత కోసం అంతర్జాతీయంగా వివిధ రకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న వారికి కార్బన్ రిమూవల్ యూనిట్స్ పేరుతో ప్రోత్సహకాలు అందిస్తున్నాయి. ఈ రకంగా పచ్చదనం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అనంతపురం జిల్లా ఉంది.

పది శాతంలోపే అటవీభూమి ఉన్న ఈ జిల్లాలో పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తున్న వారికి కార్బన్ రిమూవల్ యూనిట్స్ పేరుతో ప్రోత్సహకాలు అందించేందుకు నెథర్లాండ్స్‌కి చెందిన రాబో బ్యాంకు ముందుకొచ్చింది. క్షేత్రస్థాయిలో అనంతపురం జిల్లాలో అమలు చేసే బాధ్యతను యాక్షన్ ఫ్రెటర్నా (ఎఎఫ్ ఎకాలజీ) కేంద్రం చేపట్టింది. ఆ సంస్థ పనిచేస్తున్న 15 మండలాల్లో దీని అమలుకు సమయత్తమైంది. వీరి పరిధిలో సుమారు 8300 మంది రైతులు ఉండగా, 10230 హెక్టార్ల పంటలు సాగు చేస్తున్న వారున్నారు. తొలుత రాప్తాడు మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో దీని అమలు మొదలు పెట్టారు. ఈ గ్రామం పరిధిలో ఉద్యనవన పంటలు సాగు చేసే రైతులు ఒక్క పంటే కాకుండా అందులో పది రకాలైన ఉద్యానవన పంటలను వైవిద్య భరితంగా సాగుకు ముందుకొచ్చినట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని, తోడ్పాటును ప్రారంభం నుంచి ఎఎఫ్ ఎకాలజీ సంస్థ అందిస్తుంది. అంతేకాకుండా వైవిద్య సాగు వలన ఏ మేరకు పచ్చదనం పెరిగింది... ఏ మేరకు కర్బన ఉద్గారాల తగ్గింపు జరిగిందన్న దానిపై శాటిలైట్ ద్వారా మదింపు చేస్తారు. బాగా పచ్చదనం పరిరక్షణ చేపట్టిన రైతులకు కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రోత్సహకం అందిస్తారు. ఈ రకంగా రైతుకు సగటున నాలుగు వేల వరకు ఆదాయం సమకూరే అవకాశాలున్నట్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. దీన్ని విస్తతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టినట్టు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టరు మల్లారెడ్డి తెలిపారు.

బుక్కచెర్ల గ్రామంలో సాగు చేసిన ఉద్యానవన పంట

అవగాహన కల్పించడంతో ముందుకొచ్చాం..

ఉద్యానవన పంటలను ఒక్క రకమే కాకుండా అందులో గట్ల వెంట సరుగుడు, టేకు, గంధంతోపాటు మధ్యమధ్యలో జామ, సోపాట, మామిడి వంటి వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యాం. దీని ద్వారా ఒక్క పంటతోనే కాకుండా వివిధ రకాల పంటల ద్వారానూ అదనపు ఆదాయం రైతుకు సమకూరుతుంది. పైగా ప్రోత్సహకం కూడా అందిస్తామని చెబుతున్నారు. దీంతో ఈ రకమైన విధానంలో పంటలు సాగు చేస్తున్నాం.

ప్రతాప్‌రెడ్డి, రైతు బుక్కచెర్ల గ్రామం.

పర్యావరణహితం.. రైతుకు ప్రయోజనం



పర్యావరణ అసమ తుల్యతతో వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. అనేక అనర్థాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ అంశాన్నే తాము పనిచేసే ప్రాంతాల్లో రైతులకు వివరిస్తున్నాం. రైతుకు వివిధ రకాల పంటల వలన ఆదాయం సమకూరడంతోపాటు, పర్యావరణ హితం జరుగుతుంది. అనేక మంది రైతులు ఈ రకమైన పంటల సాగుకు ముందుకొస్తున్నారు. రాబోయే రోజుల్లో దీనిపై మరింత మందిలో అవగాహన కల్పించి వైవిద్యభరితమైన ఉద్యానవన పంటల సాగు చేపట్టే విధంగా కషి చేస్తాం.

వైవి.మల్లారెడ్డి ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్.

ప్రోత్సాహకాలు అందిస్తాం

పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు అంతర్జాతీయంగా అందరి ముందున్న సవాలు. వాతావరణంలో మార్పులు సంభవించి ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో పర్యావరణ పరిరక్షణపై అంతార్జతీయం అనేక సంస్థలు దృష్టి సారించాయి. ఈ రకంగా పరిరక్షించేందుకు ముందుకొచ్చే వారికి ప్రోత్సహకాలు అందివ్వాలని నిర్ణయించారు. దీని అమలు చేసే బాధ్యతను తాము చేపట్టాం. జిల్లాలో బుక్కచెర్ల గ్రామంలో ఈ రకంగా ఒక రైతు వైవిద్యభరితమైన పంటల సాగును చూశాను. ఇదే రకంగా ఇతర రైతులకు ముందుకొచ్చి పర్యావరణ పరిరక్షణతో తోడ్పాటునందివ్వాలి.

అన్నే లాట్ కెమ్మా, రాబో బ్యాంకు ఆర్ఎం.

తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- సిఐటియు నేత ఓబులుకు కలెక్టర్ హామీ
- విధుల్లోకి చేరిన కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు ధీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు రోజులుగా మోటార్‌లు నిలిపివేసి నిరసన చేపట్టారు. కార్మికుల నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సత్వరమే స్పందించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం నాడు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులుతో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ క్రమంలో సిఐటియు నేత ఓబులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా కలెక్టర్‌కు వివరించారు. కార్మికులు వేతనాల కోసం ప్రతి నెలా రోడ్లు ఎక్కి అరిస్తే తప్పా సజావుగా జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. నాలుగు నెలల వేతనాలు బకాయిలుంటే సమ్మె చేసిన సందర్భంలో 2 నెలలు వేతనాలు వేయడం సమ్మె విరమింపజేయడం పరిపాటిగా మారిందన్నారు. తాగునీటి సరఫరా కార్మికులు ట్రంక్ లైన్, ఫేస్ 4 కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, మడకశిర కార్మికులందరూ 14 నెలల నుంచి 25 నెలల వరకు పిఎఫ్, 4 నెలల నుంచి 6 నెలల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లకు నిధులు విడుదల కాలేదంటూ చెబుతున్నారని వివరించారు. 3 నెలలుగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, డివిజన్ కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి 12 సంవత్సరాలుగా పని చేస్తున్న 18 మంది కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. పిఎఫ్ రూ.300 వేయలేదన్నారు. లీకేజీలకు మరమ్మతులకు వస్తువులు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ శివారెడ్డి, కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డిలకు ప్రభుత్వం నుంచి నిధులు రానందున 14 నెలల పిఎఫ్ వేయలేకపోయామని చెబుతున్నారన్నారు. వీటన్నింటిపై కలెక్టర్ స్పందించారు. తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గురువారం నాడు కాంట్రాక్టర్‌లతో సమావేశం జరుపుతామని హామి ఇచ్చారు. కార్మికుల సమస్యపై రాష్ట్ర సిసి దృష్టికి వెళ్లిందన్నారు. కార్మికులందరూ విధుల్లోకి వెళ్లేలా చూడాలని ఓబులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ హామీతో కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఓబులు కార్మికులు విధుల్లోకి చేరుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ హామీ మేరకు కార్మికులందరూ బుధవారం సాయంత్రం నుంచి విధుల్లోకి చేరారు. ఈ నిరసన కార్యక్రమానికి సహకరించిన కార్మికులు, రైతులు, ప్రజలందరికీ సిఐటియు గౌరవాధ్యక్షులు ఓబులు, యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, గంగాధర్, రాము, నరేష్, వన్నూరుస్వామి, రామాంజనేయులు కతజ్ఞతలు తెలియజేశారు.

కదిరి మున్సిపాల్టీ అవినీతిపై లోగుట్టుగా విచారణ..!?

- ప్రజాశక్తి వరుస కథనాలపై ఉన్నతాధికారుల స్పందన
- వివరాల సేకరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాలిటీలో కొందరు అధికారుల చేతివాటంపై ఉన్నతాధికారులు స్పందించినట్లు తెలుస్తోంది. ఇటీవల కదిరి మున్సిపాల్టీలో చోటు చేసుకున్న అవినీతిపై ప్రజాశక్తి వరుస కథనాలను ప్రచురించింది. మున్సిపాల్టీలో ఏ పని జరగాలన్నా కొందరు అధికారులు ప్రతి దానికి ఓ రేటు నిర్ణయించి అందిని కాడికి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై 'ఆగని వసూల్ రాజా ఆగడాలు' అన్న శీర్షికపై ప్రజాశక్తిలో శనివారం నాడు మరో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించినట్లు తెలుస్తోంది. అనంతపురం రీజినల్ డైరెక్టర్ కార్యాలయానికి కదిరి మున్సిపల్ కార్యాలయం ముఖ్య అధికారులు, సిబ్బందిని పిలిపించి లోగుట్టుగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. విచారణలో ఉన్నతాధికారులు ఆరోపణలపై పూర్తి స్థాయిలో ఆరా తీసినట్లు సమాచారం.

ఆయా ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగంలో కూడా కదిరి మున్సిపల్ అధికారులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఎన్నికల నిధులే కాకుండా మున్సిపాల్టీ సాధారణ నిధులను కూడా ముఖ్య అధికారులు స్వాహా చేసినట్లు గుసగుసలు విన్పిస్తున్నాయి. పైస్థాయి అధికారుల అండదండలతో కిందిస్థాయి అధికారులు కూడా అందిన కాడికి దోచుకుంటున్నారంటూ సొంత శాఖలోనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఏదైనా పనిపై కార్యాలయానికి వెళ్లే వారికి నిబంధనల పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అన్ని సరిగా ఉన్నా ఏదో ఒక కారణం చూపి వారి పని చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇచ్చే వారికి మాత్రం క్షణలు పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. కదిరి మున్సిపాల్టీలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు లోతైన దర్యాప్తు చేస్తే మరిన్ని అవినీతి వాస్తవాలు బహిర్గతం అయ్యే అవకాశం ఉందని పట్టణ ప్రజలు తెలియజేస్తున్నారు.

26న చిన్నపిల్లల ఉచిత వైద్యశిబిరం

స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సాయినగర్‌లో ఉన్న స్పందన హాస్పిటల్‌లో ఈ నెల 26వ తేదీ (ఆదివారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న పిల్లలకు వచ్చే జ్వరం, విష జ్వరాలు, దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు, కడుపు నొప్పి, మలేరియా, టైఫాయిడ్, న్యూమోనియా, పుట్టిన పిల్లల వచ్చే కామెర్లు, బేదులు, మెదడు వాపు వ్యాధి, తదితర జబ్బులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా అడ్మిషన్ చేసుకొని వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. స్పందన హాస్పిటల్‌లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచితంగా ఓపి కూడా చూస్తామని తెలిపారు. పుట్టిన పిల్లల కోసం ఐసియు, ఫోటోథెరపీ, హైఫ్లో ఆక్సిజన్ మిషన్, వెంటిలేటర్ల సౌకర్యాలు అన్నివేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రముఖ (కర్నూల్ మెడికల్ కాలేజ్ ఎండి) చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.మహేంద్ర నాథ్‌చే వైద్య చికిత్సతో పాటు చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు వాటి గురించి తెలియజేస్తారన్నారు. పేద కుటుంబాలకు ఇదొక మంచి అవకాశం అని వారు తెలిపారు.

24 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తచెరువు రూరల్ : ఈ నెల 24వ తేదీ నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఇఒ మీనాక్షి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకూ పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 24వ తేదీ తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న గణితం, 29 ఫిజికల్ సైన్స్, 30న బయాలజికల్ సైన్స్, 31వ తేదీ సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని డిఇఒ తెలిపారు.

గోరంట్ల పిహెచ్‌సి వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

గోరంట్ల ఎంఎల్‌హెచ్‌పిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గోరంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఆశా వర్కర్లను వేధింపులకు గురిచేసిన ఎంఎల్‌హెచ్‌పి గౌతమిపై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి మంజువాణికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిలో ఉపకరణాలు మాయం చేసిందని అసత్య ఆరోపణలు చేయడంతో ఆశా వర్కర్ శబరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. దీంతో ఆశా వర్కర్లు గోరంట్ల పిహెచ్‌సి వద్ద ధర్నా చేపట్టి వేధింపులకు పాల్పడిన ఎంఎల్ హెచ్‌పి గౌతమిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కానీ ఇంతవరకూ పోలీసులు కానీ, వైద్యాధికారులు కానీ ఎంఎల్ హెచ్‌పిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై ప్రశ్నించారు. దీనికితోడు గౌతమి వ్యవహారశైలి మార్చుకోకపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డిఎంహెచ్‌ఒకి వివరించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గౌతమిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, సంఘం నాయకురాలు ముంతాజ్, శకుంతల, కళావతి, రామలమ్మ, శబరి, తదితరులు పాల్గొన్నారు.

కదిరివాసికి డాక్టరేట్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పరిశోధన గ్రంథంతో ఎం.జయరామ్

కదిరి పట్టణానికి చెందిన ఎం.జయరామ్ బాటని సబ్జెక్టులో డాక్టరేట్ సాధించినట్లు తెలిపారు. జయరామ్ మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని సన్‌రైజ్ యూనివర్సిటీలో బాటని ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్రకుమార్ ఆధ్వర్యంలో 'మొక్కల పెరుగుదలలో విత్తనం ఆవశ్యకత, బ్యాక్టీరియా ప్రభావం' అనే అంశంపై విశ్లేషణ పరిశోధన చేశారు. అతని ప్రతిభకు సన్‌రైజ్ యూనివర్సిటీ వారు ఈ నెల 20వ తేదీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. జయరామ్ డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

పాత నేరస్తులు, రౌడీ షీటర్ల ఇళ్లల్లో సోదాలు

పుట్టపర్తి రూరల్ : జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులు, రౌడీషీటర్ల నివాసాల్లో ప్రత్యేకంగా సోదాలు చేశారు. అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని పలు మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు. రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు చేశారు. ఈ మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. సిఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో పోలీసులు కర్నాటక మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణ కోసం పాత కేసుల్లోని నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాములు, తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. అనుమానితుల వివరాలను లోతుగా తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ తర్వాత ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని కోరారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్‌ఐ

పుట్టపర్తి : ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల బుధవారం డీఎస్పీ వాసుదేవన్, పుట్టపర్తి రూరల్ సిఐ రాగిరి రామయ్య ఆధ్వర్యంలో బుక్కపట్నం మండలంలోని కొత్తకోట గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసాయని, ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల తర్వాత కూడా గ్రామాల్లో ప్రజలు గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానితుల ఇళ్లల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి, ఏఎస్‌ఐ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కటకటాలే : సిఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున, ఆ తర్వాత గ్రామాల్లో ఎవరైనా పార్టీల పేరుతో ఘర్షణలకు పాల్పడితే కటకటాలు తప్పవని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి, పోతుకుంట ఎస్‌ఐలు పి.శ్రీనివాసులు, నాగేంద్ర హెచ్చరించారు. వారు బుధవారం మండలంలోని ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న వారి ఇళ్లలో సోదాలు చేశారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఫలితాలు ఎలా వచ్చినా వాటిని రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత, పార్టీల పేరుతో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని సచివాలయాల్లో మహిళా పోలీసులతో సమావేశమై గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు చేరవేయాలని సూచించారు.

ముంగారు సేద్యం పనుల్లో రైతాంగం

వెంటాడుతున్న కాడెద్దులు, పనిముట్ల కొరత

ఆలస్యమైన విత్తన వేరుశనగ పంపిణీ

దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఈ ఏడాది తొలకరి చినుకులు రైతులను ముందే పలకరించాయని చెప్పవచ్చు. ముంగారు సేద్యానికి అవసరమైన ముందస్తు ముంగారులో వర్షం రానే వచ్చింది. అయితే 'మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న' చందంగా ఇప్పటికే ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. కదిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాస్తో కూస్తో వర్షం కురిసింది. ఈ వర్షాలు రైతుకు కొంతవరకూ ఊరటనిచ్చేవే. అయితే రైతులను ముందస్తు ముంగారు సేద్యానికి అవసరమైన పనిముట్లు, కాడెద్దుల ఆందోళన వెంటాడుతోంది. కొందరు రైతులు ఇప్పటికే బీడు భూమిలో చెత్తచెదారం, పుల్లలు, కలుపు మొక్కలు తొలగించుకుంటున్నారు. సేద్యానికి అవసరమైన కాడెద్దులు, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు లేకపోవడంతో కూలి మనుషులనైనా పెట్టి పని చేయించుకుందామంటే ఇప్పటికే చాలా మంది వ్యవసాయ కూలీలు వలస బాట పట్టారు. దీంతో రైతులు ఎటూ దిక్కుతోచని స్థితిని ఎదర్కొంటున్నారు. బీడు భూమిని దుక్కి చేయిద్దాం అనుకుంటే ట్రాక్టర్ల బాడుగలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గంటకు వెయ్యి రూపాయలు బాడుగ అడుగుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇక చిన్న, సన్న కారు రైతుల విషయానికొస్తే వ్యవసాయం అంటేనే జూదంలా మారిందని, ఏటా కనీసం పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మరి కొందరు రైతులు జూన్ మాసంలోనే విత్తనం వేయాలని, అయితే నేటికీ రాష్ట్ర ప్రభుత్వం విత్తనం పంపిణీ చేయకుండా ఇంకా ఏర్పాట్లలోనే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మండలాల్లో అయితే ఇప్పటికీ ఎంత విత్తన వేరుశనగ అవసరం పడుతుందో అనే విషయాన్ని కూడా లెక్క తేల్చలేదని తెలుస్తోంది. రేపో, మాపో కలెక్టర్ కార్యాలయం నుంచి పూర్తి వివరాలు వస్తాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముంగారు సేద్యానికి అవసరమైన విత్తనం ముందస్తుగా అందించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకూ సబబని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు రాయితీతో అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వాటి ఊసే ఎత్తలేదు. విత్తన సాగుకు సమయం ఆసన్నమైనా, అధికారులు ఇంతవరకూ రైతుకు విత్తన వేరుశనగను పంపిణీ చేయకపోవడంలో అంతర్యం ఏమిటని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో పంట సాగు చేసేందుకు రైతులు విత్తనం సిద్ధం చేసుకుని, బీడు భూములు దుక్కి చేసుకున్నా ప్రభుత్వం సకాలంలో ఎరువులు అందజేస్తుందా అనేది సందేహమే. నియోజకవర్గ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బికె) రైతుకు ఉపయోగపడే ఏ ఒక్క పనిముట్లు లేవు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల గొప్పలు చెప్పుకోవడమే కానీ వారికి సహాయ సహకారాలు ఏ మాత్రం అందించలేదన్న విమర్శలు జోరందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో దుక్కి చేయడానికి ఎద్దులు, ట్రాక్టర్లు కూడా కరువయ్యాయి. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిద్ర మత్తు వీడి ముంగారు సేద్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాగ్యరేఖ

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, అనంతరం పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ భాగ్యరేఖ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ వాసుదేవన్ అధ్యక్షతన నియోజకవర్గంలోని తహశీల్దార్లు, సిఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్, ఫలితాల అనంతరం గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయని, లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమయ్యే పరిణామాలు ఉన్నందున ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రోల్ బంకులు, కిరాణా అంగళ్లలో బాటల్స్‌లో డీజిల్, పెట్రోల్ నింపి విక్రయించటాన్ని నిరోధించాలని, కర్నాటక నుంచి డీజిల్, పెట్రోల్, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఎక్కడా నలుగురికి మించి ఉండరాదన్నారు. అంగళ్లు, టీ బంకుల దగ్గర గుంపులుగా ఉండరాదన్నారు. పేలుడు పదార్థాలు, టపాసులు, అక్రమ నిల్వలను గుర్తిస్తే సీజ్ చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో బైండోవర్ జాబితాను ఈ ఎన్నికల్లో జాబితాను పోల్చి చూసి ఎవరైనా మిస్ అయి ఉంటే వారిని గుర్తించాలన్నారు. రాళ్లు, కర్రలు, రాడ్స్, ఇతర వస్తువులు నిర్మాణ పనులకు మాత్రమే వాడాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పుట్టపర్తి తహశీల్దార్ వేణుగోపాల్, నల్లమాడ నాగభూషణం, బుక్కపట్నమ్ భారతి, కొత్త చెరువు కళావతి, డిఎఒ వెంకటస్వామి, ఒడిసి ఖాజాబి, అమడగూరు రమాకాంత్‌రెడ్డి, పుట్టపర్తి అర్బన్ సిఐ కొండారెడ్డి, రూరల్ సిఐ రాగిరి రామయ్య, కొత్తచెరువు రాజారమేష్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా స్థాయి సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ మంజువాణి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మంజువాణి

ప్రసవ సమయంలో జన్మనిచ్చే తల్లితో పాటు పుట్టే బిడ్డ ఎట్టి పరిస్థితుల్లో మరణించకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి ఆదేశించారు. డిఎంహెచ్‌ఒ బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రంలో మాతాశిశు మరణాలపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా ఆమె గత నెలలో జిల్లాలో సంభవించిన మాతా, శిశు మరణాలపై పిహెచ్‌సిల వారీగా సమీక్షించారు. ఏప్రిల్ నెలలో ఒక మాత, 8 శిశువుల మరణాలు జరిగినట్లు తేలింది. దుర్గానగర్‌లో ఒక మాతా మరణం జరగ్గా ముదిగుబ్బ, వెంగళమ్మచెరువు, కనగానపల్లి, ఇందిరానగర్, పేరూరు, కోడూరు, ఎనుములపల్లి పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో 8 శిశు మరణాలు జరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి బిడ్డను కాపాడుకోవాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడే వారికి తగిన జాగ్రత్తలు సూచించి ప్రసవ సమయంలో తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేలా సేవల అందించాలన్నారు. మాతా శిశు మరణాలు జరిగిన ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది ఎక్కడ లోపం జరిగిందో పరిశీలించాలన్నారు. మరణాలు జరగకుండా బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సెల్వియా సాల్మన్, డాక్టర్ శ్రీలత, గైనకాలజిస్ట్ వీరమ్మగాయత్రి, ఆయా పిహెచ్‌సిల వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం, పెనుకొండలో గెలిచేది కూటమే..!

పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, జిల్లా అధ్యక్షులు అంజనప్ప

ప్రజాశక్తి-సోమందేపల్లి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సవితమ్మ, అంజనప్ప

రాష్ట్రంలో రాబోయేది కూటమి(టిడిపి, బిజెపి, జనసేనపార్టీ) ప్రభుత్వమేనని టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ధీమా వ్యక్తం చేశారు. పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ అధికారం చేపట్టాక రాష్ట్రంలో అభివృద్ధితో వైసిపి అవినీతి, అక్రమాలపై చర్యలు ఉంటాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేసిన దౌర్జన్యాలు, అరాచకాలను సార్వత్రిక ఎన్నికల్లో కొనసాగించి గెలుపు కోసం వైసిపి శ్రేణులు విఫల యత్నం చేశారన్నారు. అయితే పోలింగ్ సాధ్యమైనంత మేర సజావుగా జరిగేందుకు అధికారులు, మీడియా, ఓటర్లు సహకరించారని తెలిపారు. వైసిపి పాలనతో విసిగిపోయి ఎపికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి యువత, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారన్నారు. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానంలో కూటమి అభ్యర్థులు గెలవబోతున్నాం అన్నారు. గత ఐదేళ్ల భయాందోళనలతో పని చేసిన అధికారులు ఇప్పుడు బాధ్యతగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించారన్నారు. రాష్ట్రంలో కూటమికి 130 సీట్లు రాబోతున్నాయని, ఎన్నికలకు ముందు వై నాట్ 175 అని ప్రగల్భాలు పలికిన వైసిపి నాయకులు ఇప్పుడు కనీసం 75 సీట్లు వస్తాయని చెప్పుకునేందుకు వెనుకాడుతున్నా రన్నారు. జగన్ షాక్ అయ్యేలా ఫలితాలు ఉంటాయన్నారు. ప్రజలు ఏకపక్షంగా కూటమి వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోందన్నారు. అయితే కేడర్ జారిపోకుండా వైసిపి మైండ్ గేమ్ ఆడుతోందన్నారు. పిన్నెల్లి రామకృష్ణ ఈవీఎం ధ్వంసం చేయడం చూస్తుంటే వాళ్ల ఫ్రస్ట్రేషన్ బాగా అరమవుతుందన్నారు. జూన్ 9వ తేదీ చంద్రబాబు సిఎంగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారని, జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తాగు, సాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, శ్రీనివాసులు, డివి.ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, వడ్డీ శ్రీనివాసులు, చిన్నపోతన్న, వీర చిన్న, ఆవుల అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ సొసైటీ సభ్యుల అత్యుత్సాహం

పరిగి చెరువులో వేటకు వెళ్లిన వారిపై దాడియత్నం

ప్రజాశక్తి-పరిగి

జిల్లాలో రెండో అతిపెద్ద చెరువు పరిగి చెరువు. ఇందులో లభించే చేపలకు మంచి గిరాకీ ఉంది. ఇదే ఇప్పుడు మత్స్యశాఖ సొసైటీ సభ్యులకు ఆదాయ వనరుగా మారింది. ఇక్కడ వారి అజమాయిషీ రోజు రోజుకు శృతిమించుతోందని చెప్ప వచ్చు. ఇతరులు చెరువులో చేపల వేటకు వెళ్తే వారిపై దాడులకు ప్రయత్నించడం, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సదరు వ్యక్తులకు పోలీసులు ద్వారా చెప్పించడం పరిపాటిగా మారింది. ఈ క్రమం లోనే గత మంగళవా రం పరిగి చెరువులో మండలానికి చెందిన నరసా పురం, సిరికుళం గ్రామస్తుల వలలు వేసి చేపలు పట్టేం దుకు వెళ్లడంతో వారితో సొసైటీ సభ్యులు గొడవ పడడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సొసైటీ సభ్యులు మత్స్యశాఖ అనుబంధంతో చేపల పెంపకం, అమ్మకాల ద్వారా రూ. లక్షలు వెనుకేసుకుని ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పరిగి చెరువులో చేపల పెంపకానికి మత్స్య శాఖ ఆమోదం తెలిపింది. దీని ద్వారా వచ్చే ఆదాయం మత్స్య శాఖకు వెళ్లాలి. అలా కాకుండా కొందరు దళారులు కమిటీ పేరుతో మత్స్య శాఖకు చెందిన సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పరిగి చెరువుపై మండల వ్యాప్తంగా 7 పంచాయతీలు ఆధారపడి ఉన్నాయి. అయితే కొందరికి మాత్రమే సొసైటీలో స్థానం ఎలా కల్పిస్తారని తమకు అవకాశం కల్పించాలని నర్సాపురం, సిరికుళం గ్రామస్తులు సొసైటీ సభ్యులతో వాదనకు దిగడంతో సొసైటీలో పని చేసే వ్యక్తి వారిపై కట్టెలతో దాడికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ గొడవ మండలంలో చర్చనీయాంశం అవడంతో సొసైటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎస్‌ఐ చేత ఫోన్ ద్వారా గ్రామస్తులను హెచ్చరించినట్లు సమాచారం. సొసైటీ దోపిడీపై జిల్లా స్థాయి అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా సత్యసాయి భక్తుల గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలో బుధవారం సత్యసాయి గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి రాత్రి 7 గంటలకు గణేష్ గేట్ నుంచి 7 కిలోమీటర్లు ఊరేగించారు. ప్రదక్షిణలో భక్తులు సత్యసాయి భజన చేస్తూ ముందుకు సాగారు. గణేష్ గేట్ నుంచి గోకులం, ఎనుములపల్లి సర్కిల్, పెట్రోల్ బంక్, ఎద్దులకొండ, పెద్దకమ్మవారిపల్లి చింతతోపు మీదుగా తిరిగి రథాన్ని పుట్టపర్తికి తీసుకొచ్చారు. ప్రతి పౌర్ణమి ముందు రోజు ఈ గిరి ప్రదర్శన ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. గిరి ప్రదక్షిణలో విదేశీ భక్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముళ్లపొదల్లోకి దూసుకుపోయిన కారు

మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.కొట్టాల గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఇన్నోవా కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫణీంద్ర తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పట్నం ఎస్‌ఐ నరసింహుడు తెలిపిన వివరాలు.. ఎం.కొట్టాల గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఫణీంద్ర ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా ఫణీంద్రకు తీవ్రంగా గాయపడ్డాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో రోడ్డు ప్రమాద సమాచారం తెలుసుకున్న పట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఫణీంద్రను బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్లు పట్నం ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

హస్నాబాద్‌లో పోలీసుల తనిఖీలు..

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

హిందూపురం : త్వరలో ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్తగా సిఐ శ్రీనివాస్, ఎస్‌ఐ హారున్‌బాషా పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని హస్నాబాద్‌లో బుధవారం వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇటీవల ఎవరైనా కొత్తగా ఇక్కడికి వచ్చి ఉంటే వారి వివరాలు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఎలక్షన్ కౌంటింగ్‌కు సంబంధించి ఎవరూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయకూడదని, గొడవలకు వెళ్లకూడదని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో స్థానిక, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

కదిరిలో..

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ బాబ్‌జాన్

కదిరి అర్బన్ : పట్టణంలో ప్రతిఒక్కరూ ద్విచక్ర వాహనాలను బాధ్యతగా నడపాలని ఎస్‌ఐ బాబ్‌జాన్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని జీమాను కూడలిలో బుధవారం ఎస్‌ఐ పోలీసు సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేయరాదన్నారు. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కచ్చితంగా దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమనే విషయం తెలుసుకొని, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణతో వాహనం నడపాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసేంత వరకూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మావటూరులో..

మావటూరులో ప్రజలతో మాట్లాడుతున్న సిఐ, ఎస్‌ఐ

సోమందేపల్లి : పెనుకొండ మండలంలోని మావటూరు గ్రామంలో బుధవారం పెనుకొండ సిఐ యుగంధర్, ఎస్‌ఐ రాజేష్ పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే గ్రామంలో రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. తనిఖీల్లో రొద్దం, పరిగి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

ముదిగుబ్బ : పట్టణంలోని 4 సచివాలయాలు, ఆర్‌ఎస్ తండాలోని 2 సచివాలయాలను బుధవారం ఎంపిడిఒ నాగశేషాచలరెడ్డి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎంపిపికి మండల సర్పంచుల పరామర్శ

రొద్దం : అనారోగ్యంతో కొద్దిరోజులుగా బెంగళూరులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిపి చంద్రశేఖర్‌ను బుధవారం మండలంలోని పలు పంచాయతీ సర్పంచులు ఆసుపత్రికి వెళ్లి పారమర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు పరమేష్, రామాంజి, సోమిరెడ్డి, రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవం

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నరసింహ స్వామి జయంత్యుత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఘనగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, భక్తులకు పానకం, వడపప్పు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రము ఖులు, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, శేషాద్రి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ గౌరవ సభ్యులు, ఎంఎన్.మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాలబావి ఆధునీకరణ

కదిరి టౌన్ : పట్టణంలో స్వయంభువుగా వెలసిన ప్రసిద్ధ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అనుబంధంగా పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో శ్రీవారి భక్తురాలు సాసవల చిన్నమ్మ తన భక్తికి నిదర్శనంగా తవ్వించిన బావి(పాలబావి)ని పరమ పుణ్యతీర్థంగా భావిస్తారు. ఈ బావిలో నిత్యం నీరు ఉంటుంది. అటువంటి బావిని పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. నృసింహ జయంతి సందర్భంగా బుధవారం కదిరి పట్టణ యువకులు, ముత్యాలచెరువు గ్రామస్తులతో కలిసి పాలబావిలో పేరుకుపోయిన చెత్తచెదారం, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. అలాగే పాలబావి చుట్టూ రంగులు వేసేందుకు బర్జర్ పెయింట్స్ కిన్నెర సిద్దు రంగులు సమకూర్చారు. కార్యక్రమంలో ముత్యాలచెరువు గ్రామస్తులు నరేష్, నాగేంద్ర, నరసింహులు, వెంకటేష్, కదిరి పట్టణ యువకులు కార్తీక్, గణేష్, నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పాలబావిని శుభ్రం చేస్తున్న యువకులు